క్లుప్తంగా

నల్లచెరువు పాఠశాలలో ఉర్దూ డీఐ తనిఖీలు



గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని నగర పాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఖాసిం మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సాధించిన మార్కులను ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ప్రగతి పత్రాలను త్వరితగతిన రూపొందించాలని సూచించారు. అదే విధంగా వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా, ప్రభుత్వ సూచనల మేరకు తప్పనిసరిగా రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ మోగించి, మంచి నీరు తాగే విధంగా చూడాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల నమోదు కోసం చర్యలు చేపట్టాలని కోరారు.

40 మంది వలంటీర్లు రాజీనామా



నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని 54వ డివిజన్ 158, 159 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 40 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పోస్టులకు రాజీనామా చేసి ఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలకు అందజేశారు. సీఎం చేసిన మంచి కార్యక్రమాలకు ప్రజలకు వివరించేందుకు తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

బొంతల వెంకటేశ్వర్లు కృషి మరువలేనిది



నెహ్రూనగర్: రజకుల సమస్యల పరిష్కారంలో బొంతల వెంకటేశ్వర్లు చేసిన కృషి మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అరండల్‌పేటలో వెంకటేశ్వర్లు 5 వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితంగా పోరాడాల్సిన సమయం అసన్నమైందన్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) మాట్లాడుతూ పేద రజక కులంలో పుట్టి రజకులను చైతన్యం చేయంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ జాతీయ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, బీసీ సంఘ నాయకులు శివయ్య, ఉమా మహేశ్వరరావు, రమాదేవి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌గా డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌గా డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు గురువారం విధుల్లో చేరారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను డిప్యూటేషన్‌పై ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ చేసింది. డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రెడ్డిగూడెంకు చెందిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు 2005లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. హైదరాబాద్ ఉస్మానియాలో 2011లో జనరల్ సర్జరీ పీజీ చదివారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సూపర్‌స్పెషాలిటీ పీజీని యశోధలో 2016లో పూర్తిచేశారు. వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2021లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. 2023 డిసెంబరులో అనంతపురంకు బదిలీ అయిన ఆయన్ను ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్‌లో లివర్ మార్పిడి ఆపరేషన్ల కోసం గుంటూరుకు బదిలీ చేశారు.

రెండు నామినేషన్లు దాఖలు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి, పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మిలు నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఖాజా వెంకట రాఘవేంద్ర సంజీవరావు నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరికి అందజేశారు. అదేవిధంగా పశ్చిమ నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కోటపాటి సురేష్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మికి అందజేశారు.

టీడీపీ దుర్మార్గాలన్నీ ప్రజలకు తెలుసు



ప్రచారంలో భాగంగా వృద్ధురాలిని పలకరిస్తున్న మంత్రి విడదల రజిని



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

- టీడీపీకి మరోసారి ప్రజలు ఓటుతో వేటు వేయడం ఖాయం
- జగనన్న పాలనలో ఎంతో అభివృద్ధి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: టీడీపీ అధికారంలో ఉండగా.. ఆపార్టీ నేతలు ఎన్ని దౌర్జన్యాలు చేశారో, ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారో ప్రజలందరికీ తెలుసని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 18, 52 డివిజన్లలో గురువారం మనతో మన రజినమ్మ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు జరిగిన మేలును ప్రజలు ఆమెకు తెలియజేసి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో రూ. రెండున్నర లక్షల కోట్ల సంక్షేమం ప్రజలకు నేరుగా అందిందని చెప్పారు. రూ.లక్ష కోట్లకు పైగా పారిశ్రామిక పెట్టుబడులు ఆచరణ రూపం దాల్చాయని తెలిపారు. రాష్ట్రంలో గతమెన్నడూ ఎరుగనంత అభివద్ధి ఈ ఐదేళ్లలోనే జరిగిందని పేర్కొన్నారు. నిన్నటి దాకా సంక్షేమం చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని గగ్గోలు పెట్టిన వాళ్లు ఈ రోజు తాము అంతకంటే ఎక్కువ సంక్షేమం చేస్తామని చెబుతున్నారని, వారి మాటల్లోనే మోసం స్పష్టంగా తెలుస్తోందన్నారు. టీడీపీ కూటమి మోసపు మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు.

వెస్ట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

గుంటూరు వెస్ట్ నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని విడదల రజిని అన్నారు. మంత్రిగా నగరంలో అభివృద్ధికి చేయూతనందించానని, వెస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. మనతో మన రజినమ్మ కార్యక్రమంలో భాగంగా మంత్రి రజిని 20వ డివిజన్‌లోని నల్లచెరువు 17, 18, 19, 20 లైనుల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ముస్లిం మహిళలు మంత్రి రజినికి ఘన స్వాగతం పలికారు. 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు కంతేటి శ్యామ్, ఖాజా మొహిద్దీన్, శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రవి, నాగూర్, ఇర్ఫాన్, జుబేర్, టెంట్ హౌస్ బాబు, ఇబ్రహీం, బాబు తదితరులు పాల్గొన్నారు. 52వ డివిజన్ చంద్రయ్య నగర్, రజక కాలనీ, సగర కాలనీ 16 వలైనులో పర్యటించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్, మాజీ కార్పొరేటర్ ఆలా సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు మాదాల కిరణ్, కడియం రామాంజనేయులు, రెడ్డి కోటేశ్వరరావు, మద్దుల రాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 30 కుటుంబాలు చేరిక..

పట్నంబజారు: గుంటూరు నల్లకుంట ప్రాంతానికి చెందిన దాదాపు 30 కుటుంబాల వారు గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆ ధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీ రందరినీ మంత్రి విడదల రజిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నుంచి ఓర్సు వెంకటేశ్వర్లు, ఓర్సు బాల వెంకట్రావ్, ఓర్సు అజయ్, ప్రసాద్, ఏసు, అజయ్ యాదవ్, ముసలయ్య తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నుంచి రక్షణపై మాక్‌డ్రిల్



స్టెమ్ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాల్సిన విధానాలపై అగ్నిమాపక శాఖాధికారులు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు చూపించారు. జిల్లా సహాయ అగ్నిమాపక శాఖాధికారి కె.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు-1 అగ్నిమాపక సిబ్బంది పాఠశాల ప్రాంగణంలో అగ్ని నివారణ పరికరాల ద్వారా ప్రత్యక్షంగా చూపారు. ఫైర్ ఎగ్జిట్వింగిషర్స్, హోజ్ రీల్ హోజ్, వాటర్ బ్రౌజర్, హైడెంట్లను ఉపయోగించి అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యం స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ కాలనీలోని భాష్యం స్కూల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాల్సిన విధానాలపై అగ్నిమాపక శాఖాధికారులు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు చూపించారు. గుంటూరు-2 స్టేషన్ అగ్నిమాపక శాఖాధికారి పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిని ఓడించండి

సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పీజే జేమ్స్

కొరిటెపాడు(గుంటూరు): ఆర్ఎస్ఎస్ ఎజెండాతో భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు దాసోహం అంటున్న బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జె.జెమ్స్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ ప్రచార పత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం పూర్తిగా రద్దుచేసే అవకాశాలు ఉన్నాయని, దేశంలో తదుపరి ఎన్నికలు జరగని పరిస్థితి కూడా ఏర్పడవచ్చని చెప్పారు. దివాలా కోరు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఎన్డీఏ కూటమిని ప్రజలు ఓటు వేసి ఓడించాలని కోరారు. మార్చి 10న సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ నాగపూర్‌లో జరిగిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సదస్సులో భావ సారూప్యత కలిగిన అభ్యుదయ ప్రజాస్వామ్య శక్తులు, వర్గాలతో కలసి తమ ఓటును వ్యూహాత్మకంగా ఉపయోగించాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పోలిట్ బ్యూరో సభ్యుడు మనవ హరిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ కమిటీ కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ పుష్పలత, జి.వెంకట్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మచక్రం గ్రంథావిష్కరణ



ధర్మచక్రం గ్రంథావిష్కరణలో సాహితీవేత్తలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఢమరుకం లలిత కళాసమితి ఆధ్వర్యంలో గురువారం సాహితీవేత్త చిటిప్రోలు వెంకటరత్నం రచించిన ధర్మచక్రం చారిత్రాత్మక పద్య నాటక పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభకు రచయిత గన్నె వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సూర్యదేవర రవికుమార్ గ్రంథాన్ని ఆవిష్కరించగా, సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి గ్రంథ సమీక్ష నిర్వహించారు. ప్రముఖ హరికథా భాగవతార్ తుర్లపాటి శంభయాచార్యులు నాటక పద్యాలను ఆలపించగా, సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, రంగస్థల నటుడు ఎం.అర్జునరావు, వి.మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

నిరంతరం ఫాగింగ్ చేపట్టాల్సిందే

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్



తాడేపల్లిరూరల్ : నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ దోమల నిర్మూలనకు ఫాగింగ్ ప్రక్రియ నిరంతరం చేపట్టడంతో పాటు శానిటేషన్ పై పూర్తి దృష్టి సారించాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. ఎక్కడనుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత ప్రాంతాల్లో విధులు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్పొరేషన్ సమావేశ మందిరంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛత సాకారం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని, నగరంలోని అన్ని రహదారులు, డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. నగరంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త గురించి ప్రజల్లో అవగాహన కల్పించి, నగర పరిశుభ్రత, పరిరక్షణలో వారిని భాగస్వాములను చేయాలన్నారు. సచివాలయాల పరిధిలోని ఖాళీ స్థలాల గురించి ఆయా యజమానులకు నోటీసులు జారీచేసి జంగిల్ క్లియరెన్స్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సమస్యలెదురైతే కార్పొరేషన్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

విడిపోయిన భార్యపై దాడి

తాడికొండ: విభేదాలతో విడిపోయిన ఓ భర్త, తన భార్యపై దాడిచేసిన ఘటన తాడికొండ మండలం మోతడకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఎ కొండూరు మండలం, కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన బరోతు థావా అదే ఊరికి చెందిన రూపను 15 ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం. అయితే మనస్పర్థల కారణంగా ఇరువురూ ఎనిమిది నెలల క్రితం విడిపోయారు. కాగా గురువారం మోతడకలో బంధువుల వివాహానికి రూప వచ్చింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో భర్త పచ్చడి బండతో తలపై దాడి చేశాడు. అప్రమత్తమైన స్థానికులు రూపను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు



ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామానికి చెందిన బొడ్డు నరేష్ బోయపాలెంలో మద్యం విక్రయించేందుకు వెళుతూ, ఆటో కోసం మెయిన్ రోడ్డుపై వేచి ఉన్నాడు. పక్కా సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. అతని వద్ద అక్రమంగా 180 ఎం.ఎల్. పది మద్యం బాటిళ్లను గుర్తించారు. ఈ మేరకు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురువారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఓటు ఆవశ్యకత తెలుసుకోండి

తెనాలి అర్బన్ : ఓటు ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ బస్సులోకి వెళ్ళి ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. అలాగే ఉద్యోగులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవం... జల విహార తెప్పోత్సవం



గంగాపూజ కార్యక్రమం

తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రి ఉపాలయమైన సీతానగరం శ్రీమద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సీతారాములకు జల విహార తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవస్థాన కార్య నిర్వహణాధికారి కేఎస్ రామారావు గంగాపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది, ఈఈ ఎల్ రమ, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ స్వీకరణకు హెల్ప్ డెస్క్

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ విధులకు ఎంపికైన పశ్చిమ నియోజకవర్గ ఉద్యోగులు ఈ నెల 22వ తేదీలోపు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో ఫారం-12లను అందించాలని, పోస్టల్ బ్యాలెట్ ఫారాల స్వీకరణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ(94) రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్.ఓ) కె. రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పచ్చిమ నియోజకవర్గంలో ఓటు కలిగి ఉండి 2024 సాధారణ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఎలక్షన్ సెల్ నందు ఫారం -12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్, డ్యూటీ ఆర్డర్ కాపి, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు ఇవ్వాలన్నారు. ఉద్యోగుల నుంచి అందే ఫారం -12 వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో ఏరోజుకు ఆరోజే నమోదు చేయాలని ఎలక్షన్ సెల్ సిబ్బందిని ఆదేశించారు.

ఫారం 1 నోటీసు ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం నామినేషన్ల నోటిఫికేషన్ ఫారం-1 నోటీసుని నోటీస్ బోర్డుల్లో ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థలోని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నోటీస్ బోర్డులో ఫారం-1 నోటీసుని ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, ప్రదీప్ కుమార్, మేనేజర్ ప్రసాద్‌లు నోటిఫికేషన్‌ని అంటించారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఫారం-1 నోటీసుని ప్రభుత్వ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే 25 వరకు అందిన నామినేషన్లను 26న పరిశీలన చేస్తామని తెలిపారు. 29న నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ కాగా మే 13 న ఎన్నికలు, జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.

నామినేషన్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న తుళ్ళూరు డీఎస్పీ అశోక్ బాబు

తాడికొండ: గురువారం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియకు పోలీసులు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారన్న సమాచారం మేరకు అన్ని ప్రధాన రహదారుల వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వివాదాలకు తావు లేకుండా 200 మీటర్ల దూరంలోనే నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల అనుచరులను నిలిపివేయనున్నట్లు తుళ్ళూరు డీఎస్పీ ఈ ఈశోక్ బాబు తెలిపారు. నామినేషన్‌కు సంబంధించి అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద క్రమశిక్షణా చర్యలు చేపడతామన్నారు.

సాగర్ జలాలతో నిండు కుండలా..



సాగర్ జలాలతో నిండుకుండను తలపిస్తోన్న ఫిరంగిపురం చెరువు.

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లోకి సాగర్ జలాలు చేరుతున్నాయి. దీంతో మండు వేసవిలోనూ తటాకాలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. రేపూడిలో చెరువుకు సాగర్ జలాలను తరలిస్తోన్న తీరును గ్రామీణ నీటిపారుదల శాఖ సహాయక ఇంజినీర్ (ఏఈ) శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫిరంగిపురం. వేమవరం, కండ్రిక, మేరికపూడి, మునగపాడు గ్రామాల్లోని చెరువులను పూర్తి స్థాయిలో సాగర్ జలాలతో నింపామన్నారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల చెరువులకు సాగర్ జలాలను పంపిస్తామన్నారు. దీనిద్వారా మూడు నెలలకు సరిపడా తాగునీటి అవసరాలకు ఎలాంటి ఢోకా ఉండబోదని చెప్పారు.

విశ్వబ్రాహ్మణ సంఘీయుల ఆత్మీయ సమావేశం

ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు నిర్ణయం

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు గుంటూరు నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ సంఘీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్, ఎమ్మెల్యే ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు అనుసరించాల్సి విధానాలపై ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రానున్న ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల నుంచి విశ్వబ్రాహ్మణ సంఘం తరపున అభ్యర్థులను బరిలో నిలిపేందుకు తీర్మానించినట్లు చెప్పారు. అందరి అభిప్రాయాల మేరకు ఈ నెల 22న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు సుబ్బారావు పేర్కొన్నారు. త్వరలో తూర్పు నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. సంఘ నాయకులు యు.నాగేశ్వరచారి, వెంకటచారి, శివరాజేశ్వరిచారి, లక్ష్మీనారాయణ, శివరామకృష్ణ, రావణబ్రహ్మ, కృష్ణమూర్తి, చిరంజీవచారి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్



పొన్నూరు: పెట్రోల్ బంకులలో, వంట గ్యాస్ గోడౌన్‌లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్రాధికారి కె. ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనలిచ్చారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రమాదాలు సంభవించినపుడు జాగ్రత్తలు పాటించాలని, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని పల్లకీ ఊరేగింపు



ఊరేగింపుగా వెళుతున్న పల్లకీ ముందు ఆలయ కమిటీ సభ్యులు

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మసెంటర్ సమీపంలో ఉన్న కోదండ రామాలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజ కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో కోదండరాముని పల్లకి ఊరేగింపు వైభవంగా జరిగింది. కొరిటెపాడు పురవీధులలో మంగళ వాయిద్యాలు, దేవత మూర్తుల వేషధారణలు, కోలాట ప్రదర్శన సందడితో కొనసాగింది. ఆలయ చైర్మన్ కొమ్మినేని శివకోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షులు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, కిలారి రత్తయ్య, సీతారామయ్య , భక్తులు పాల్గొన్నారు.

NARAYANA SUPER SPECIALITY HOSPITAL
MEDICAL & HEALTH
AP State Government.
Medical Reimbursement facility available at
NARAYANA SUPER SPECIALITY HOSPITAL
Old Club Road, Kothapeta
Guntur. 9542432277

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com